ఆగని చోరీలు

- విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొడుతున్న దుండగులు
- గతేడాది సబ్ డివిజన్ పరిధిలో 58 దొంగతనాలు
- కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులో చిక్కులు
- ఎఫ్ఐఆర్ కాపీ ఉంటేనే ఏర్పాటు
- రైతులే కాపాడుకోవాలంటున్న విద్యుత్ అధికారులు



రాగివైరు కోసం ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టిన దృశ్యం (ఫైల్)

పొదలకూరు: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఆగడం లేదు. మూడురోజుల క్రితం మండలంలోని అల్లూర్తి, కనుపర్తి పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి అందులోని రాగి తీగను ఆగంతకులు అపహరించారు. అంతకుముందు కల్యాణపురం గ్రామ పొలాల్లో విద్యుత్ మెయిన్ తీగలను కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు ఆగడం లేదని స్వయంగా సంబంధిత అధికారులే వెల్లడిస్తున్నారు. వాటి భద్రతను రైతులు చూసుకోవాల్సిందిగా గ్రామాల్లో తమ సిబ్బంది ద్వారా తెలియజేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురైతే తిరిగి దాని స్థానంలో కొత్తది ఏర్పాటు చేసేందుకు అనేక రకాలుగా ఇబ్బందులు ఉన్నాయంటున్నారు. మెట్ట ప్రాంతాల్లో అధికంగా ఉండడంతో రైతులు కష్టాలు పడాల్సి వస్తోంది. ఇందుకోసం ట్రాన్స్‌ఫార్మర్ దొంగలించబడిన ప్రాంతం రైతులు విద్యుత్ అధికారులకు సమాచారం అందజేస్తే వారు వెళ్లి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు ఎఫ్ఐఆర్ కాపీని తీసుకుంటేనే కొత్తది ఏర్పాటు చేస్తారు.

గతేడాది అధికంగా..

గతేడాది పొదలకూరు విద్యుత్ సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటి వరకు 58 ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేశారు. 15 చోట్ల మాత్రమే తిరిగి అమర్చడం జరిగింది. మిగిలిన ట్రాన్స్‌ఫార్మర్లను బిగించాల్సి ఉండగా అధికారులు సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుని ఏర్పాటు చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్ నుంచి పొదలకూరు సెక్షన్‌లో 37, విరువూరు సెక్షన్‌లో 6, మనుబోలు సెక్షన్‌లో 15 ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. అయితే వాటికి సంబంధించిన ఎఫ్ఐఆర్ కాపీలు అందకపోవడం, ఇతర సాంకేతిక కారణాల వల్ల అన్నింటిని అధికారులు పెట్టలేకపోతున్నారు. ఇలాంటి చోరీ ముఠాలో విద్యుత్ పనులు తెలిసిన వారు ఒకరుంటారనేది గతంలో పట్టుబడిన దొంగల ద్వారా తెలిసింది. తోటలు, పొలాల్లో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేసే ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతను ఇకపై ఆయా రైతులు చూసుకోవాల్సిందిగా అధికారులు వెల్లడించారు. దొంగతనాలు అధికమవుతున్న నేపథ్యంలో అన్నదాతలు కూడా తమ వంతు బాధ్యతను తీసుకోవాల్సిందిగా సూచిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి అందులో ఉన్న రాగి తీగను తస్కరించే దొంగ ఈ ఏడాది ఫిబ్రవరిలో దొరికి కటకటాల పాలయ్యాడు. పొదలకూరు పోలీసులు 27 కేసులున్న నిందితుడు ప్రసాద్‌ను చాకచక్యంగా పట్టుకోగలిగారు. అతను పొదలకూరు మండలంతోపాటు నెల్లూరు రూరల్, వెంకటాచలం, ముత్తుకూరు, బుచ్చిరెడ్డిపాళెం, తోటపల్లిగూడూరు తదితర మండలాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మల దొంగతనాలకు పాల్పడ్డాడు.

రైతులు సహకరించాలి



రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం జరిగితే వెంటనే వెల్లడించాలి. చాలా రోజుల క్రితం చోరీ జరిగిన ట్రాన్స్‌ఫార్మర్ల సమాచారం ఇప్పుడు తెలుస్తోంది. రైతుల భాగస్వామ్యం ఉంటే చోరీలను అరికట్టేందుకు అవకాశం ఉంటుంది. తరచూ అన్నదాతలు తోటలు, పొలాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలించాలి.

– శ్రీకాంత్, విద్యుత్ ఏఈ, పొదలకూరు

అలా వదిలేశారు!

- తుప్పు పడుతున్న ఎండీయూ వాహనాలు
- ఐదుగురి రాజీనామా
- రెండింటిపై 6ఏ కేసులు



రెవెన్యూ కార్యాలయం వెలుపల ఉన్న వాహనాలు

పొదలకూరు: మండలంలో రేషన్ బియ్యం పంపిణీకి వినియోగించే ఎండీయూ వాహనాలు స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద తుప్పు పడుతున్నాయి. కూటమి ప్రభుత్వం పాత పద్ధతిలోనే సరుకులను అందజేస్తున్నా ఎండీయూ వాహనాలను కొందరు సరెండర్ చేశారు. దీంతో వాటి లాగిన్లలోనే సంబంధిత రేషన్‌షాపుల డీలర్లు సరుకులను అందజేయాల్సి ఉంటుంది. మండలానికి మొత్తం 12 వాహనాలను గత ప్రభుత్వంలో కేటాయించారు. ఇందులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 5 వాహనాలను నడిపే వారు రాజీనామా చేశారు. రెండింటిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు 6ఏ కేసులను నమోదు చేశారు. దీంతో సరెండర్ చేసిన ఐదు వాహనాలు రెవెన్యూ కార్యాలయంలో తుప్పు పడుతున్నాయి. పొదలకూరు, సూరాయపాళెం వాహనాలను నిర్వహించే వారిపై కేసులు నమోదు చేయడం వల్ల అవి కూడా ఆగిపోవడంతో ప్రస్తుతం మండలంలో 5 వాహనాలను నడుపుతున్నారు. అయితే డీలర్లు ఎండీయూ లాగిన్లోనే ఇప్పటికీ సరుకులను ఇవ్వాల్సి వస్తోంది. ఫలితంగా డీలర్లతోపాటు, వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల్లేని ప్రాంతాల్లో ఒక్కసారిగా లబ్ధిదారులు డీలర్ల వద్దకు వస్తున్నారు.

మండల సమావేశం నేడు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : బుచ్చిరెడ్డిపాళెం మండల ప్రజాపరిషత్ సమావేశం మంగళవారం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీహరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, కో-ఆప్షన్ సభ్యులు, మీడియా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

డీఎల్‌పీఓ రమణయ్య పరిశీలన

పొదలకూరు: పట్టణంలోని మూడు దశాబ్దాల క్రితం వేసిన సత్యనారాయణ లేఅవుట్‌పై సమగ్ర నివేదిక కోసం నెల్లూరు డీఎల్‌పీఓ రమణయ్య సోమవారం విచ్చేశారు. ఆయన లేఅవుట్‌ను పరిశీలించారు. ప్రజాప్రయోజనాల కోసం అప్పట్లో లేఅవుట్ నిర్మించిన వారు సుమారు 300 అంకణాలను వదిలి పెట్టారు. అయితే ఈ స్థలాన్ని కొందరు విక్రయించడంతో వివాదాలు చోటుచేసుకున్నాయి. పంచాయతీ అధికారులు సదరు స్థలం పంచాయతీకి చెందాలని హెచ్చరిక బోర్డులు పెట్టారు. అయితే కొనుగోలు చేసిన వారు తమ వద్ద రికార్డులు న్నాయని హైకోర్టును ఆశ్రయించారు. దీంతో పంచాయతీ, స్థలం కొనుగోలు చేసిన వారి మధ్య న్యాయస్థానంలో కేసు నడుస్తోంది. ఇందుకు సంబంధించి పంచాయతీ సెక్రటరీ వాయిదాలకు హైకోర్టుకు వెళ్లి వస్తున్నారు. అయితే లేఅవుట్‌పై సమగ్ర నివేదిక అవసరమని జిల్లా ఉన్నతస్థాయి అధికారులు భావించి డీఎల్‌పీఓను విచారణ నిర్వహించి లేఅవుట్‌కు సంబంధించి స్కెచ్‌ను తీసుకు రావాల్సిందిగా ఆదేశించారు. సెక్రటరీ ద్వారా తహసీల్దార్‌కు లేఖ రాసి ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన స్థలం స్కెచ్‌ను అందజేయాలన్నారు.

మద్యం దుకాణంలో చోరీ

- వాచ్‌మెన్‌పై దాడి



వివరాలు తెలుసుకుంటున్న సీఐ

మనుబోలు: మండలంలోని మడమనూరు మద్యం దుకాణంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తుల చోరీకి పాల్పడ్డారు. వాచ్‌మెన్‌పై దాడి చేసి బంధించి కౌంటర్‌లో ఉన్న రూ.1,500 నగదును ఎత్తుకెళ్లారు. ముగ్గురు యువకులు రెండు మోటార్‌బైక్‌లపై వచ్చి వాచ్‌మెన్‌ను కత్తులతో బెదిరించి నగదు చోరీ చేశారు. ఆపై అతడిని తీసుకెళ్లి అక్కంపేట సమీపంలోని ఓ లేఅవుట్ వద్ద వదిలారు. సమాచారం అందుకున్న సీఐ రామకృష్ణారెడ్డి, ఎస్సై శివరాకేష్ సోమవారం ఘటనా స్థలానికి చేరుకుని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వినతుల అందజేత



విద్యార్థికి కుల ధ్రువీకరణపత్రాన్ని అందజేస్తున్న తహసీల్దార్ స్ఫూర్తి రెడ్డి

కొడవలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలువురు తమ సమస్యలపై వినతులు అందజేశారు. ఈ సందర్భంగా నార్తురాజుపాళేనికి చెందిన ఓ విద్యార్థి కుల సర్టిఫికెట్‌లో తప్పులు ఉండడంతో తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈ మేరకు ఆమె తప్పులను సరిచేసి కొత్త కుల ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎంఈఓ జి.వసంతకుమారి, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషా, ఏఓ రామ్‌ప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి



ఆర్జేడీ జగన్నాథం పద్మను కలిసిన జేఏసీ నేతలు

నెల్లూరు (టౌన్) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్టు లెక్చరర్స్ జేఏసీ రాష్ట్ర కో-చైర్మన్ కల్లూరి శ్రీనివాసులు కోరారు. ఈ మేరకు గుంటూరులో ఇంటర్ విద్య జోన్-3 ఆర్జేడీగా బాధ్యతలు చేపట్టిన జగన్నాథం పద్మను సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టనున్న రేషనలైజేషన్, బదిలీల్లో అధ్యాపకులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెగ్యులరైజేషన్, రెన్యూవల్, గతేడాది మే నెల కాలానికి పెండింగ్ జీతాలు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర చైర్మన్ సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సైదులు, జాయింట్ సెక్రటరీ వీరయ్య పాల్గొన్నారు.

డీకేడబ్ల్యూలో అభివృద్ధి కార్యక్రమాలు



కళాశాలలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను పరిశీలిస్తున్న సంస్థ బృందం

నెల్లూరు(టౌన్): కోరమండల్ సంస్థ ఆధ్వర్యంలో స్థానిక డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో రూ.13 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేసినట్లు సంస్థ కడప జోన్ మార్కెటింగ్ హెడ్ టి.చక్రధర్ తెలిపారు. ఈ క్రమంలో రూ.6 లక్షలతో చేపట్టిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను సంస్థ బృందం సోమవారం పరిశీలించింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్క ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్‌లో 30 రోజుల పాటు శిక్షణ ఇచ్చి రూ.4.30 లక్షల విలువ చేసే కుట్టు మెషీన్లను అందజేసినట్లు చెప్పారు. ఆక్వా రంగంలో విద్యార్థులు కొత్తరకం ఫుడ్‌లను తయారు చేసే విధంగా రూ.3 లక్షల విలువతో కూడిన ఆక్వాపాప్ (స్టార్టప్ ల్యాబ్)ను ఏర్పాటు చేసి పరికరాలను అందజేసినట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో డీకేడబ్ల్యూ కళాశాలలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కోరమండల్ కడప జోన్ హెచ్ఆర్ సౌజన్య, ఇక్క ఫౌండేషన్ డైరెక్టర్ కిశోర్, కళాశాల ప్రిన్సిపల్ గిరి, కో-ఆర్డినేటర్ రంజని పాల్గొన్నారు.

క్లుప్తంగా

సజ్జలను కలిసిన బట్టేపాటి



ఇందుకూరుపేట: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని ఆ పార్టీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధి బట్టేపాటి నరేంద్రరెడ్డి సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి సాయిబాబా ప్రతిమను అందజేసి, రైతులకు సంబంధించిన పలు విషయాల గురించి వివరించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మైనారిటీ నాయకుడు షేక్.షబ్బీర్ ఉన్నారు.

గ్రామాల్లో ప్రచారం



పొదలకూరు: ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక పొదలకూరు కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని బిరదవోలు, పార్లపల్లి, చెర్లోపల్లి గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీతపై సోమవారం ప్రచారం చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు జి.పెంచలనర్సయ్య, కృష్ణయ్య, మధు, కిశోర్, పద్మమ్మ, శేషాద్రి, పెంచలయ్య, మాళవిక, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా ఖత్నాలు



కొడవలూరు: మండలంలోని యల్లాయపాళెం మసీద్‌లో ముస్లిం జేఏసీ ఆధ్వర్యంలో వైద్యాధికారి యూసఫ్ సహకారంతో సోమవారం ఉచిత ఖత్నాలు నిర్వహించారు. కొడవలూరు, విడవలూరు మండలాల నుంచి వచ్చిన 35 బాలలకు ఖత్నా పూర్తి చేశారు. ఈ మేరకు వారికి జేఏసీ నేతల చేతుల మీదుగా పిండి పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జేఏసీ సభ్యులు ఖలీల్, సాదిక్, రషీద్‌లు పాల్గొన్నారు.

వీక్షా టెక్‌తో ఎంఓయూ



ఒప్పందపత్రాలు చూపుతున్న ప్రిన్సిపల్

కోవూరు : గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల ఈఈఈ విభాగం వీక్షా టెక్ సొల్యూషన్స్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకొందని ప్రిన్సిపల్ సందీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు కళాశాలలో సోమవారం ఎంఓయూ చేసుకున్నారు. అనంతరం ప్రిన్సిపల్ మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రాజెక్టులు, ఇంటర్న్‌షిప్‌లు, వర్క్‌షాప్‌లు, గెస్ట్ లెక్చర్స్, ఇతర విద్యా సంబంధిత కార్యకలాపాలలో భాగస్వామ్యం కల్పించడం లక్ష్యంగా ఉందన్నారు. ఈఈఈ విభాగం హెడ్ రవికుమార్, సంస్థ ప్రతినిధి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు మజ్జిగ పంపిణీ

పొదలకూరు: మండలంలోని నావూరుపల్లిలో ఉపాధి పనులకు హాజరైన కూలీలకు సోమవారం గ్రామస్తులు మజ్జిగ పంపిణీ చేశారు. వేసవిలో కూలీలకు మజ్జిగ అందజేతను తొలగించడంతో గ్రామపెద్దల ద్వారా ప్యాకెట్లను పంపిణీకి అధికారులు పూనుకున్నారు.

ఆర్థిక సాయం అందజేత

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: నగర పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు దశయ్య, యాదగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా, బాధితులకు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ సుప్రజ, కమిషనర్ బాలకృష్ణ ఒక్కొక్కరికి రూ.25 వేల సాయాన్ని వారి నివాసంలో అందించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కౌన్సిలర్లు శివకుమార్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ఏర్పాటు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పట్టణంలోని శాలివాహన కమ్యూనిటీ హాల్లో నారాయణ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ మాట్లాడుతూ పేదల కోసం ఉచితంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు.

కండలేరులో 45.392 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 45.392 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. సత్యసాయి గంగ కాలువకు 260, పిన్నేరు కాలువకు 70, లోలెవల్ కాలువకు 50, హైలెవల్ కాలువకు 30, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

చెరువు తూముల ఎత్తివేతపై రైతుల ఆగ్రహం

- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



వృథాగా బయటకు వెళ్తున్న నీరు

వెంకటాచలం: వెంకటాచలంలోని కనుపూరు చెరువు తూములు ఎత్తివేయడంపై ఆయకట్టు రైతులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనుపూరు చెరువులో చేపలు పట్టేందుకు కొందరు స్వార్థపరులు తూములు ఎత్తివేయడంతో నీరంతా కాలువలు, పొలాల్లోకి వృథాగా వెళ్తోంది. వేసవి కాలం కావడంతో చెరువులో సమృద్ధిగా నీరుంటే వెంకటాచలం, కనుపూరు, కందలపాడు, కాకుటూరు, ఎర్రగుంట తదితర గ్రామాల్లో తాగునీటి ఎద్దడి ఉండదు. అయితే కేవలం చెరువులో ఉన్న చేపలు పట్టుకోవాలనే స్వార్థంతో వారంరోజుల నుంచి నీటిని బయటకు విడుదల చేయడంపై ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడంలేదని రైతులు మండిపడుతున్నారు. నీటిని బయటకు విడుదల చేసిన వారికే సహకరిస్తున్నారని వాపోయారు. జిల్లా అధికారులు స్పందించాలని కోరుతున్నారు.

భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నాం



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ముత్తుకూరు: తమ ప్రాజెక్ట్‌లో భద్రతా ప్రమాణాలు పాటిస్తున్నామని నేలటూరులోని ఎస్ఈఐఎల్ ఎనర్జీ సీఈఓ రాఘవ్ త్రివేది తెలిపారు. సోమవారం జాతీయ అగ్నిమాపక సేవ పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముత్తుకూరు, తోటపల్లిగూడూరు మండలాల్లో అగ్ని మాపక, వైద్య సేవలందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా హఠాత్తుగా చెలరేగే మంటల్ని ఎలా అదుపు చేయాలి, నష్టాలు జరగకుండా ఎటువంటి చర్యలు తీసుకోవాలన్న అంశంపై ఎస్ఈఐఎల్ అగ్నిమాపక సిబ్బంది ద్వారా మాక్‌డ్రిల్ జరిపారు. సంస్థ ఓఅండ్ఎం హెడ్ సునీల్‌కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

పేదలకు ఉచిత న్యాయ సహాయం

- సీనియర్ సివిల్ జడ్జి వాణి



మాట్లాడుతున్న వాణి

ముత్తుకూరు: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా పేదలకు ఉచిత న్యాయ సహాయం చేస్తున్నట్టు ఆ సంస్థ జిల్లా కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి తెలిపారు. మండలంలోని పిడతాపోలూరులో సోమవారం జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె పాల్గొని ప్రసంగించారు. సామాజికంగా వెనుకబడిన వర్గాలు, నిరక్షరాస్యులు, దివ్యాంగులకు ఉచిత న్యాయ సహాయం చేస్తున్నట్టు చెప్పారు. పేదలు తమ పిల్లలను తప్పకుండా చదివించాలని సూచించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దన్నారు. కార్యక్రమంలో అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కొవ్వూరు కుమారి, ఈఓపీఆర్డీ హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాల అందజేత



వెంకటాచలం: పదో తరగతి పరీక్ష ఫలితాల్లో ప్రతిభ చూపిన గుడ్లూరువారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల నలుగురు విద్యార్థులకు రిటైర్డ్ టీచర్ హస్తి లక్ష్మణరాజు రూ.6 వేల నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. సోమవారం స్కూల్లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వీవీ రమణ మాట్లాడుతూ జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేసిన లక్ష్మణరాజు విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. పిల్లలు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కొడవలూరు: భూసార పరీక్షలతో సత్ఫలితాలు సాధించవచ్చని ఏఓ లక్ష్మి సూచించారు. మండలంలోని యల్లాయపాళెంలో భూసార పరీక్షలపై రైతులకు సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులను ఉపయోగించడం వల్ల దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయన్నారు. ఏఈఓ పి.వెంకట్రావు, వీఏఏ జి.ఉమామహేష్ పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం పెంపు

కొడవలూరు: గ్రంథాలయాల్లోని పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందని రిటైర్డ్ హెచ్ఎం వెంకయ్య తెలిపారు. కొడవలూరులోని గ్రంథాలయంలో వేసవి శిక్షణా శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో విద్యార్థులు ఎండల బారిన పడకుండా గ్రంథాలయాలకు రావడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో నీతి కథలు చదివించడం, ల్యాప్‌టాప్‌లో కథలు ప్రదర్శించి చూపడం చేశారు. తొలుత విద్యార్థులతో గ్రంథాలయాల ప్రాముఖ్యతను తెలుపుతూ ప్రతిజ్ఞ చేయించారు. లైబ్రేరియన్ కె.రాజేశ్వరి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వేసవి విజ్ఞాన శిబిరం ప్రారంభం

➡ **మనుబోలు:** మనుబోలు గ్రంథాలయం ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో వేసవి విజ్ఞాన శిబిరం (సమ్మర్ క్యాంప్)ను సోమవారం ప్రారంభించామని లైబ్రేరియన్ అరుణ్‌కుమార్ తెలిపారు. మొదటిరోజు విద్యార్థుల చేత కథలు చదివించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదివిన కథలను విశ్లేషించడం, కథలు చెప్పడం, స్పోకెన్ ఇంగ్లిష్, డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్స్ తయారీ తదితర వాటిపై శిక్షణ ఉంటుందన్నారు.



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: పుస్తకాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు, అధికారులు

➡ **బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** నగర పంచాయతీ పరిధిలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. నగర పంచాయతీ కమిషనర్ బాలకృష్ణ, ఎంపీడీఓ శ్రీహరి పాల్గొని, మాట్లాడారు. విద్యార్థులు సెలవుల్లో సెల్‌ఫోన్, ట్యాబ్ లాంటివాటికి దూరంగా ఉండాలన్నారు. గ్రంథాలయంలో నిర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగేందుకు గ్రంథాలయాలు దోహదం చేస్తాయన్నారు. లైబ్రేరియన్ మంజులత పాల్గొన్నారు.



మనుబోలు: పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు



కొడవలూరు గ్రంథాలయంలో నీతి కథలు చదువుతున్న విద్యార్థులు